


# కాలమ్ దాటని కబుర్లు

## బలభద్రపాత్రుని రమణి



### నెల నెలకి కొన్ని కులాసా కులాసా కబుర్లు

## 'నా సినిమా పిచ్చి'

**ఈ నాటా సభలకి** ఆహ్వానిస్తూ, లిటరరీ ఛైర్ డా. ఉరుమిండి నరసింహారెడ్డిగారు ఆహ్వానంతోపాటు మా పూర్వీకుల చరిత్ర 'విన్నవీ – కన్నవీ' కూడా పంపించారు. బలభద్రపాత్రుని వారి వంశ చరిత్ర, మా వారి పెద్దనాన్నగారి అబ్బాయి ప్రొ.కేశవరావుగారు రాసారు.

ఆ పుస్తకం చదివాక, నాకు చాలా నీరసం కలిగింది. వందల ఎకరాలు, ఎవరిమీదో కోపం వచ్చి పంతం పౌరుషంతో నీళ్ళొదిలేసి వచ్చారని వుంది ఆ పుస్తకంలో. అదీ ఒకసారి కాదు రెండు సార్లు. మళ్ళీ శివాలయం కట్టి, బీడు భూములని సాగు భూములుగా మార్చి, వందెకరాలు దేవతకి దానం చేసి వచ్చేసారు. అకటా.. అవే మా అందరికీ వుండి వుంటే ఇలా సెన్సార్ బోర్డూ, జ్యూరీ డ్యూటీలూ చెయ్యకుండా జమిందారిణిలా శాలువా కప్పుకుని, కళ్ళద్దాలు పైకి తోసుకుంటూ "అబ్బాయిలుంగారూ, మీ తండ్రిగారు నిద్రలేచారా చూసి రండి" అని మా పిల్లలతో మాట్లాడుతూ రాజసం ఒలకబోసేదాన్నేమో కదా అని కుమిలిపోయాను. కానీ డాలస్ నగరంలో వున్న మా ఆడబిడ్డ (ఈ కేశవరావుగారి స్వంత చెల్లెలు) అరుణ వదిన "ఓసి పిచ్చిదానా, వందల ఎకరాలు పోయినా, దేవాలయం కట్టి, లలితా అమ్మవారికి ఇచ్చేయడం వలన ఆస్తి, మీరూ మీ బిడ్డలూ పైకొచ్చి సుఖంగా వున్నారు అని ఓ చల్లని మాట చెప్పడంతో కాస్త ఊరడిల్లాను. జోక్స్ ఎ పార్ట్. వలివేరులో మా బలభద్రపాత్రుని వాళ్ళు కట్టించిన లలిత గుడి ఇప్పటికీ ఉంది.

ఇంక సినిమా విభాగంలో స్పీకర్స్, నేనూ, ప్రముఖ లిరిక్ రైటర్, మా తమ్ముడు అనంత శ్రీరాం, ఆర్.జీ.వి. అదేనండీ మన 'శివ' సినిమా తీసిన అప్పట్లో కుర్రాడు.

నన్ను సెన్సార్ బోర్డ్ గురించి మాట్లాడమంటే లేదండీ చిన్నప్పటినుండి నాకున్న సినిమా పిచ్చిని గురించి మట్లాడ్తా అని చెప్పాను.

"మీ ఇష్టం" అన్నారు.

అక్కడ మాట్లాడినది మీకు చెప్తాను.

అసలు అండీ దేవతల్లో గాలి తిరుగుడు తిరిగే పోర్ట్ ఫోలియో ఒకటి వుంది. దానికి 'తథాస్తు' దేవతలని పేరు. వాళ్ళు పైన గాలికి తిరుగుతూ, కొన్ని మనం మాట్లాడే మాటలు విని 'తథాస్తు' అనేసి పోతారు.

చిన్నప్పుడు నన్ను సినిమాకి తీసుకుపోకుండా, మా అమ్మా, పెద్దమ్మా, నాకన్నా వయసులో పెద్దవాళ్ళైన అక్కలూ సినిమాకి పోతుంటే నేను కిందపడి కాళ్ళు తంతూ గిలగిలా కొట్టుకుంటూ "నేను సినిమా చూస్తాను... సినిమానే చూస్తాను" అని ఏడవడం వలన.. ఆ సమయంలో పైన తిరుగుతున్న తథాస్తు దేవతలు బద్దకం వీడి, అప్పుడప్పుడు ఉద్యోగం చేస్తారు కావున 'తథాస్తు' అనేసి పోయివుంటారు.

ఇలా నా సినిమా ప్రారంభం అయింది. నా సినిమా పిచ్చి ఐదారేళ్ళకే ముదిరి ఏ సినిమా చూసినా, ఇంట్లో మంచం అడ్డుపెట్టి సెట్టింగ్‌లు వేసి, ఆ సినిమా కళ్ళకి కట్టినట్లు ఆడేదాన్ని. ఇంక ఎలాగో అలా ఒక రూపాయి తస్కరించి, లేదా పెద్దవాళ్ళని అడుక్కుని, మా ఇంట్లో పనిచేసే శ్యామలమ్మతో ఇంటి దగ్గర గోల్కొండ చౌరస్తాలో వున్న బాలాజీ టాకీసులో, సినిమాకి పోయేదాన్ని. ఇద్దరం అలా లెక్కకి మించి సినిమాలు చూసేవాళ్ళం. "అమ్మా నన్ను సినిమా హాలు గేట్ దగ్గర టికెట్ చింపి లోపలకి పంపించే వాడికిచ్చి పెళ్ళి చేయవే రోజూ ప్రతి ఆటకీ టికెట్టు కొనే పని వుండదు" అని మా అమ్మ దగ్గర ప్రతిపాదిస్తే "వీపు విమానం మోత మోగిస్తా" అంది.

అయినా నాకు ఆ ఉద్యోగం చేసే వాళ్ళమీద ప్రేమ తగ్గలేదు. అయితే బాలాజీ టాకీస్‌లో మాత్రం ఇలా గేట్ దగ్గర టికెట్ చింపి పంపే వ్యక్తి మా శ్యామలమ్మ వయసు స్త్రీ. ఆమెతో మా శ్యామలమ్మకి గట్టి స్నేహమే ఏర్పడింది. ఓనాడు ఆ స్త్రీ "నీతో కూడా వచ్చే అమ్మాయి బొద్దుగా బావుంది. ఇక్కడ షూటింగ్ వాళ్ళు వచ్చి, నలుగురైదుగురు పిల్లలు కావాలి సినిమాలోకి అని అడిగారు. సినిమాలో నటిస్తుందా?" అని అడిగిందట.

శ్యామలమ్మ దార్లో వచ్చేటప్పుడు, కీలు గుర్రం చూసి ఊహల్లో ఊరేగుతున్న నన్ను "సినిమాలో అంట ఏక్ట్ చేస్తావా బేబీ" అంది.

"ఓ!" అని కళ్ళు గుండ్రంగా తిప్పి దీర్ఘం తీసాను. అప్పుడు నాకు పదేళ్ళు వుండచ్చు. కానీ ఇంట్లో వాళ్ళు ఈ సినిమా సంగతి చెప్పగానే, శంకరాభరణం శంకర శాస్త్రిగారు 'శారదా' అని అరిచినట్లు అరిచి, ముఖ్యంగా మా అమ్మమ్మ నా మొదలయ్యే సినీ జీవితపు మొక్కని, కర్కశమైన చెప్పు కాలుతో మొదలంటా తొక్కేసింది. అలా తొక్కేయబడిన నా సినిమా జీవితంలో, ఆ తప్పిపోయిన సినిమా పేరు 'మా బంగారక్క' అందులో శ్రీదేవి హీరోయిన్.

మా బంగారక్కలో వేషం పోవడం కన్నా భయంకరమైన విషయం ఏంటంటే ఆ వేషం మా పనిమనిషి కూతురు వేయడం. ఇప్పటికీ ఆ సినిమా టీ.వీలో వస్తే శ్రీదేవి పక్కన తిరుగుతున్న నలుగురైదుగురు పిల్లల్లో, కాస్త పొడవుగా వున్నదాన్ని చూస్తే, మనసు కలుక్కుమంటుంది. సరే పోనీ అదైనా కెరీర్ కంటిన్యూ చేసిందా అంటే అదీ లేదు. కానీ సెల్యులయిడ్

తెరమీద కనిపించడం రాసిపెట్టి వుంటే తప్పించలేరు. సింగీతం శ్రీనివాసరావుగారనే సినీ మాంత్రికులు చలవ వలన, నేనూ, అనంత శ్రీరాం, భువనచంద్ర గారు వెల్‌కం ఒబామా'లో నటించాం. ఆ ముచ్చట కాస్త ఆలశ్యంగానైనా తీరింది.

ఇంక తథాస్తు దేవతల దీవెనలు ఫలితం వృధా పోదు కదా! రామానాయుడుగారి నిర్మాణంలో సినిమాలు రాస్తున్నప్పుడు, స్టూడియోలో వున్న ప్రీవ్యూ థియేటర్లో, రోజూ ఓ సినిమా, థియేటర్‌లో నడుస్తున్నవీ, కొత్తగా వచ్చినవీ తెప్పించి ఆయన చూపించేవారు. ఆ తర్వాత సెన్సార్ బోర్డ్ మెంబర్ అయ్యాను. రోజుకి రెండు సినిమాలు, తిండి పెట్టి, డబ్బులిచ్చి మరీ చూపించడం మొదలు పెట్టారు. కొంత కాలానికి నేను 'ఉట్టిగా' చూడను, అనాలనిపించేది. బయట ఎవరైనా ప్రీవ్యూలకి పిలిస్తే ఈ సినిమాలు సెన్సార్ చేసేటప్పుడున్న ఆడ సెన్సార్ బోర్డ్ ఆఫీసర్, నా మీద కక్ష పట్టినట్లు, నాకు తెలుగు తక్కువా అన్య భాషలూ ఎక్కువ వేసేది. అందులోనూ లంబాడా, భోజ్‌పురీ, బెంగాలీ లాంటివి. భోజ్‌పురి సినిమాలు ఎంత ఎక్కువ చూసానంటే "మై ఆవత్, తుం జావత్, కోనోం బాత్ నై" అని బయట కూడా భోజ్‌పురి మాట్లాడేదాన్ని.

ఇవి చాలవు అన్నట్లు నంది అవార్డ్ జ్యూరీల్లో రెండుసార్లు టీ.వీలకీ, రెండు సార్లు సినిమాలకీ జడ్జిగా ఉన్నాను. అవైతే రోజుకి మూడు కూడా చూసేవాళ్ళం సినిమాలు అవచేద్దామని.

తర్వాత 'తథాస్తు' దేవతలు నిండు మనసుతో అనడం వలన 'నేషనల్ ఫిల్మ్ అవార్డ్ జ్యూరీ"కి కూడా వేసారు 2019లో. ఇంక అప్పుడు మతే పోయింది. దాదాపు 390 భాషల పైగా స్క్రోల్ అవుతున్నాయి. కంజరా, మెయిలో, మైథిలీ, తుళూ, బైరీ.. ఇలా.. అన్ని భాషల్లో సినిమాలు వస్తాయి అనే నాకు తెలీదు అప్పటిదాకా.

ఇంక నేషనల్ ఫిల్మ్ అవార్డ్స్ జ్యూరీ అంటే రాజలాంఛనాలు "You are a central Government guest" అని టీ.విలో డిస్‌ప్లే మనకిచ్చిన 'అశోకా ' హోటల్‌లో. ఈ అశోకా హోటల్ చాలామంది ప్రైం మినిస్టర్‌లనీ, మినిస్టర్‌లనీ చూసింది. పొలిటీషియన్స్ ఎక్కువగా దిగుతారు. ఫస్ట్ చైనీస్ రెస్టారెంట్ ఇందులోనే పెట్టారుట. వెండిస్పూన్లూ, ఫోర్క్‌లూ, ప్లేట్లూ అట్టహాసంగా వుంటుంది. ముఖ్యంగా కీ బోర్డ్ వాయించే అతనికి మనం స్లిప్ పంపిస్తే, మనం కోరిన పాటలు వాయిస్తాడు. నాకోసం ప్రత్యేకమైన ఎంబాసిడర్ కార్, దానిమీద గవర్నమెంట్ గెస్ట్ అని రాసి వుండడం, ప్రధాని మంత్రిగారి ఇంటిమీదుగా రోజూ వెళ్ళడం. చాలా బావుండేది. ఈ ఎంబాసిడర్ కారు, టాటావారు కనిపెట్టినప్పటినుండీ, గొప్ప రాజసంగా వుంటుంది.

నాకు చాలా అనుబంధం వాటితో. 'రేపల్లెలో రాధ'సినిమా 2000లో రిలీజ్ అయింది. 1999 నుండీ కథా చర్చలకి ఇంటికి కారొచ్చేది. ప్రొడ్యూసర్ గారు పంపిన అంబాసిడర్ కారు మనకోసం ప్రత్యేకం రావడం. అప్పట్లో చాలా గొప్ప. ఇప్పుడు ఎవరి కార్లో వాళ్ళు వెళ్ళడం ఏమీ గొప్పగా అనిపించదు.

ఇంక మధ్యాహ్నం భోజనాలు D.F.F వాళ్ళు అంటే డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫిల్మ్ అవార్డ్స్ వాళ్ళు ప్రత్యేకంగా వంట వాడిని పెట్టి చేయిస్తారు.

మా డైరెక్టర్ చైతన్య ప్రసాద్ అనే ఆయన "మీ డ్యూటీ సిన్సియర్‌గా చెయ్యండి" అని చెప్పలేదు. మొదటి రోజు మీటింగ్‌లో "మీకు ఏం కావాలో చెప్పి వండించుకోండి" అన్నారు. పైగా వంట వాళ్ళతో కూడా "వీళ్ళు చాలా వి.వి ఐపీలు శ్రద్ధగా రుచిగా వండాలి" అని చెప్పారు.

ఇంక మేం రోజుకి నాలుగు సినిమాలు చూసేవాళ్ళం. ఒక్కోసారి ఐదు కూడా చూడాల్సొచ్చేది. 'తథాస్తు' ఫలితం మరి లాస్ట్ డే రిజల్ట్స్ డిక్లేర్ చేసి, ప్రెస్‌కి ఇచ్చి వచ్చాక, మళ్ళీ ఎవార్డ్స్ రోజున ఢిల్లీకి టికెట్, అశోకా హోటల్‌లో రూం వేస్తారు. అలాగే అయింది.

రాష్ట్రపతి హైదరాబాద్‌లో ఉన్నందున నేషనల్ ఎవార్డ్స్ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు గారు ఇచ్చారు. మరి శ్రీ శ్రీశ్రీ అమితాబ్‌బచ్చన్ గారికి దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు ప్రకటించారు కదా. కానీ ఆయన రాలేదు. జ్వరం అన్నారు. ఆశాభంగం చెంది అవార్డులయ్యాక, పార్టీ అయి, మహానటికి వచ్చినందున కీర్తి సురేష్ మిగతా వాళ్ళందరితో కలిసి ఫోటోలు తీసుకుని అక్షయ్ కుమార్, ఆయుష్మాన్, వికీ కౌశల్ లాంటి వాళ్ళని పలకరించి పరిచయం చేసుకుని వచ్చేసాం.



నేను ఇల్లు చేరగానే మెయిల్ వచ్చింది. అమితాబ్‌గారికి ఫాల్కే అవార్డు ప్రదానానికి జ్యూరీ మెంబర్స్ అయిన మీరు తప్పక రావాలని. ఆనందమానందమాయే. మళ్ళీ ఛలో ఢిల్లీ. ఈసారి రాష్ట్రపతి భవనంలో హై టీ, ప్రెసిడెంటు రామనాథ్ కోవింద్ గారూ, ప్రథమ మహిళ అయిన ఆయన సతీమణి సవితా కోవింద్‌గారితో. అమితాబ్ బచ్చన్, జయాబాధురీ, అభిషేక్ బచ్చన్‌లతో హైటీ ముఖ్యంగా నేనెళ్ళి అమితాబ్‌గారికి పరిచయం చేసుకుంటే ఇచ్చిన కరచాలనం, ఆయనకిచ్చిన అవార్డు మీద జ్యూరీలో నా పేరూ ఇవన్నీ మధురాతి మధురమైన స్మృతులు కదూ.

ఇంతకీ నువ్వు సెన్సారు బోర్డ్‌లో నీ పని చెప్పమంటే ఇవన్నీ ఏంటమ్మా నీ ఆత్మస్తుతీ అంటారా!

ఓ విషయం చెప్పి ముగిస్తా. సెన్సార్‌లో వచ్చిన ఘోరమైన దృశ్యాలని కత్తిరించి అశ్లీల సంభాషనలు తొలగించి, రక్తపాతాలని అరికట్టి, వయొలెన్స్‌ని సెన్సార్ చేసి, మీరు హాయిగా మీ కుటుంబంతో థియేటర్‌లో ఆ సినిమాలు చూసేటట్లు చేసి ఇస్తాం అనుకుంటున్నారా? ఆ భ్రాంతి విడవండి. అదేం వుండదు. డాక్టర్ డయగ్నైజ్ చేసి ఓ ప్రిస్కిప్షన్ ఇచ్చినట్లు, U,

A/U. A అనే సర్టిఫికెట్లు వాటిలో ప్రమాదపు మోతాదుని బట్టి ఇచ్చి "సినిమాకి వెళ్ళే మీ సైకిల్‌కీ, మీ కుంటుంబానికీ మీరే బాధ్యులు అని డిస్క్లైమర్‌లో ఇచ్చి వదిలేయడమే మా బాధ్యత. మీ మంచి చెడ్డలు, మీ శ్రేయస్సు , మీ కుటుంబంలో పిల్లల పరి రక్షణకి మీరే బాధ్యులు.'

ఇద్దరు పురుషులు, ఇద్దరు స్త్రీలూ, సెన్సార్ మెంబర్స్ సినిమాని చూసి, కట్స్ పెట్టి సెన్సార్ సర్టిఫికెట్ డిసైడ్ చేస్తారు.

ఈ 'కట్స్' వాళ్ళు పెట్టడం, వాటిని అమలు చేసారా? లేదా మళ్ళీ ధియేటర్‌కి వెళ్ళి చూడడం స్త్రీ సభ్యులదే బాధ్యత. ఎవరు సెన్సార్ చేసారో వాళ్ళే వెళ్ళి చూడాలి. పురుషులకి ఆ బాధ్యతలు ఇవ్వబడవు.

ఏ మాటకామాట సెన్సార్‌లో కూడా బికనీర్ వాలా నుండి వచ్చే ఫుడ్ భలే బావుండేది.

ఆవు వ్యాసంలా ఎక్కడ మొదలైనా ఫుడ్ దగ్గరకే రావడం నా ప్రత్యేకత. జీవితంలో చదవకుండానే పరీక్షలు రాయకుండానే, నాటక పరిషత్తులకీ, నందీ అవార్డులకీ, నేషనల్ ఫిల్మ్ అవార్డులకీ, ఇంటర్నేషనల్ ఫిల్మ్ అవార్డులకీ , SICA, (సౌత్ ఇండియన్ సినిమాటోగ్రాఫర్ అవార్డులు) ఇది మలేషియాలో జరిగింది. సౌత్ ఇండియాలో అన్నింటికీ జడ్జిగా నియమించబడడం నా అదృష్టం. చదువు మీద కాకుండా సినిమా మీద శ్రద్ధ ఎక్కువ పెట్టిన నా కృషీ ఫలం.


ఇంతకన్నా ఏం చెప్పనూ మళ్ళీ ఇంకోజ్యూరీ ఇండియా వెళ్ళగానే సిద్దంగా వుంది.

Post your comments










https://www.youtube.com/watch?v=ERaaX_IulS4